# పాతకథే!

రేఖా, రమేశ్ ప్రేమించుకున్నారు.
ఇద్దరూ అందంగా ఉంటారు.
పేర్లుకూడా అందంగా ఉన్నాయి.
ఒకే కాలేజీలో, ఒకే క్లాసులో చదువుకుంటున్నారు.
"మరి ప్రేమించుకోకపోతే ఏం చేస్తారు? బోడి! నువ్వు కొత్తగా చెప్పేదేమిటి?" అని అనుకుంటున్నారుగదూ?
అవును! నేను కొత్తగా ఏమీ చెప్పడంలేదు. పాత కథే చెప్తున్నాను.
"ప్రేమ" అనేది అరిగిపోయి తుప్పుపట్టిన రికార్డులోని పదమేనని అంగీకరిస్తున్నాను.
నేను కొత్త విషయం చెప్పబోవడంలేదు. పాత కథే చెప్పాలనుకొంటున్నాను.
మళ్ళీ ఆ పాత కథే ఎందుకు చెప్పడం అంటారా?
ఎందుకంటే, ప్రేమ కథలు ఎన్నిసార్లు చెప్పినా మీరు కొత్త కథ విన్నట్టే వింటారు కనక!

"యుగ యుగాలుగా పూలు వికసిస్తూనే ఉన్నయ్. గులాబి పువ్వుల్ని నిత్యం చూస్తూనే ఉన్నాం. అయినా మన వాకిట్లో పూచిన గులాబి పువ్వును ఎన్నడూ అలాంటి పువ్వును చూడనట్టే చూస్తాం. గాలికూడా ఆ పుష్పాన్ని ఉపేక్షించదు. దాని పరిమళాన్ని దశదిశలా వ్యాపింప చేస్తుంది. అలాగే పాత మాటలు కొత్త భావాన్ని వ్యక్తం చేసినప్పుడు, ఆ మాటలు కొత్తగా విన్పిస్తాయి. 'ప్రేమ' అనే పదం పాతదే కావచ్చు. కాని ఆ పదాన్ని పలికే ప్రతివ్యక్తి పెదవులమీదా, కొత్తదనాన్ని పుణికి పుచ్చుకొంటుంది. హృదయంలో కొత్త అనుభూతుల్ని కదిలిస్తుంది. అందుకే- ప్రేమ నిత్య నూతనమైంది."
పై మాటలు నావి కావు. నేను అలా అనడంలేదు.
ప్రేమ కథలు రాసేవారూ, చదివేవారూ అంటూంటారు.
అందుకే ఆ పాత ప్రేమ కథనే కొత్తగా చెప్పాలనుకుంటున్నాను.
పాత ప్రేమ కథే, రేఖా-రమేశ్‌ల మధ్య కొత్తగా ప్రారంభం అయింది.
రేఖ కాలేజీకి బాగా అలంకరించుకొని వస్తుంది.
"బాపూ" వేసిన ముఖ చిత్రంతో వెలువడిన దీపావళి స్పెషల్ మాసపత్రికలా ఆమె కాలేజీ విద్యార్థుల్ని ఆకర్షిస్తుంది.

ఆమె నడక చూస్తుంటే, రాచకొండ కథ చదువుతున్నట్టుగా విద్యార్థులకు అద్భుతమైన అనుభూతి- థ్రిల్ కలుగుతుంది.

ఆమె కళ్ళనిండా కలలు కదులుతూ కన్పిస్తాయి.

ఆమె మనసునిండా మధువు తొణికిసలాడుతూ ఉంది.

ఆ మధువును ఎవరి దోసిటిలోనైనా గుమ్మరించాలని ఆరాటపడుతోంది ఆమె మనసు.

ఆమె నవ్వితే ఇంద్రధనుస్సులు విరిగిపడ్తాయి.

ఆమె మాట్లాడుతూ ఉంటే ఉర్దూ కవిత్వం వింటున్న అనుభూతి కలుగుతుంది.

కాలేజీ మేగజైన్‌కు ఓ కుర్రాడు కథ రాశాడు. ఆ కథలోని హీరోయిన్ "రేఖే" అన్నారు అందరూ.

మరో కుర్రాడు ప్రేమ కవిత్వం రాశాడు.

అదీ ఆమెను గురించేనని అన్నారు ఎందరో.

ఆమెలో హేమమాలిని పోలికలున్నాయని కొందరు విద్యార్థులు అంటే, మరి కొందరు కాదు-వాణిశ్రీ పోలికలు ఉన్నాయంటారు.

అందాలరాశి రేఖకోసం ఎందరో విద్యార్థులు తమ హృదయాలను పారేసుకున్నారు. కొందరి హృదయాలు పగిలి, ముక్కలు చెల్లాచెదురుగా పడిపోయాయి.

హృదయాలు పారేసుకున్న వారిలో రమేశ్ ఒకడు.

కాని అది ముక్కలు కాలేదు.

'రమేశ్ అదృష్టవంతుడు' అన్నారు అందరూ.

నిజమే! రమేశ్ అదృష్టవంతుడే. కారణం, రేఖ అతడి హృదయం కిందపడి ముక్కలు చెక్కలు అయిపోకుండా దోసిలిలోకి అతి పదిలంగా అందిపుచ్చుకుంది.

ఇంకేం కావాలి?

సరికొత్త ప్రేమ కథ ప్రారంభం అయింది.

రెండు కళ్ళు నాలుగైనాయి. చార్ ఆంఖేఁ హుయీ!

చూపులు ఊసులు చెప్పుకొన్నాయి.

చిరునవ్వులు పలకరించుకొన్నాయి.

పుస్తకాలు చేతులు మారాయి.

ఆ పుస్తకాలు, అతి రహస్యంగా ప్రేమలేఖలను మోస్తూ, ఇద్దరి మధ్యా రాయబారాలు నడిపాయి.

మనసులు మార్గాన్ని అన్వేషించాయి.

కోరికలు ఆ మార్గంలో పూలను పరిచాయి.

కాని-ఆ పూలమధ్య లోకం అమర్చిన ముళ్ళు వారి కళ్ళకు కన్పించలేదు.

ప్రేమ కథ ఆ పూలబాటలో అతి వయ్యారంగా నడక సాగించింది.

సినిమాలూ-షికార్లూ-ప్రేమ సంభాషణలూ-కథ వేగాన్ని పుంజుకుంది.

ఉసిగా, ఊపుగా ముందుకు సాగిపోతోంది.

కొత్త శైలిలో పాతకథ కొంతదూరం మాత్రమే ఉత్సాహంగా నడిచింది.

అంతవరకూ, తారురోడ్డుమీద ఇంపాలా కారులా నడిచిన ప్రేమకథ, గతుకుల

బాటలో ఎద్దుబండిలా నడవసాగింది.

అన్ని ప్రేమ కథలూ కొంతదూరం ఒకేలా నడుస్తాయి. ముగింపులే వేరు వేరుగా ఉంటాయి.

రేఖ కూడా కథ ముగింపు గురించిన ఆలోచనలో పడిపోయింది.

అంతే! కథ కుంటుకుంటూ నడవసాగింది.

"ఎంతకాలం ఇలా?" ఒకరోజు రేఖ, రమేశ్‌ను నిలదీసింది.

రమేశ్ రేఖ ముఖంలోకి అయోమయంగా చూశాడు.

"ఏమిటి అలా చూస్తావ్? మన పెళ్ళి గురించి మీ నాన్నతో మాట్లాడావా?" రెట్టించింది.

రమేశ్ ఆలోచనలో పడ్డాడు.

'మాట్లాడవేం? నాకు సమాధానం కావాలి'

'మా నాన్న అంటే నాకు చచ్చేంత భయం' అన్నాడు రమేశ్ పక్క చూపులు చూస్తూ.

రేఖ కళ్ళల్లోకి భయం తన్నుకొచ్చింది.

'రోజూ చెప్పాలనుకుంటూనే చెప్పలేకపోతున్నాను-'

"మరి ఎలా?" బెంగగా అడిగింది రేఖ.

రమేశ్ ఆలోచిస్తున్నాడు. రేఖ అతడి ముఖంలోకి ఆతృతగా చూస్తోంది.

"మీ నాన్నను వచ్చి మా నాన్నతో మాట్లాడమను" అన్నాడు రమేష్.

"నాకు సిగ్గుబాబూ! మా నాన్నతో ఎలా చెప్పడం?" బోలెడంత సిగ్గుపడిపోయింది రేఖ.

'మీ అమ్మతో చెప్పు, ఆమె మీ నాన్నతో చెబుతుంది.' రేఖకు రమేష్ సలహా బాగానే ఉన్నట్లుగా తోచింది.

"ఓ.కే." అన్నది ఉత్సాహంగా.

✿ ✿ ✿

ఆ రాత్రి...

రేఖ తల్లికి విషయం చెప్పింది.

అంత గొప్పింటి కుర్రాడు తన కూతుర్ని ప్రేమిస్తున్నందుకు ఆ తల్లి మురిసిపోయింది. ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయింది.

"అదృష్టవంతురాలివి తల్లీ!" మురిపెంగా కూతురు తల నిమిరింది. కూతురు తల్లి గుండెల్లో ముఖం దాచుకుంది.

రేఖ తండ్రి ఆఫీసునుంచి బాగా అలసిపోయి వచ్చాడు. వెంటనే ఆ విషయం మాట్లాడలేకపోయింది రేఖ తల్లి.

రాత్రి భోజనం చేస్తుండగా ఎదురుగా వడ్డిస్తూ కూర్చుంది రేఖ తల్లి.

"అమ్మాయి భోజనం చేసిందా?" రేఖ తండ్రి శేషయ్య అడిగాడు.

"చేసింది" అని గిన్నెలో ఉన్న గడ్డపెరుగంతా భర్త కంచంలో గుమ్మరించింది. భర్తకు గడ్డపెరుగంటే ఇష్టం అని ఆమెకు తెలుసు.

"అరెరే! అదేవిటి? అంతా నాకే వేసేశావ్, మరి నీకో?" అన్నాడు పెరుగుతో

అన్నం కలుపుకుంటూ.

చిన్నగా ముంత బయటపెట్టింది భార్య భర్తదగ్గిర.

నోటి దగ్గరకు వెళ్ళబోతున్న అతడి చెయ్యి మధ్యలోనే ఆగిపోయింది.

కళ్ళు పెద్దవి చేసుకొని భార్యకేసి చూశాడు.

వంటింటి గడపలో నిలబడి ఉన్న రేఖకేసి చూశాడు.

తల్లీకూతుళ్ళను మార్చి మార్చి చూశాడు.

"ఏమిటి అలా చూస్తారు? ముందు అన్నం తినండి."

నోట్లో పెట్టుకొన్న ముద్ద గొంతు దిగడంలేదు. మంచి నీళ్ళు తాగాడు. పొరమాలింది.

'నాన్న ఆనందంలో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు' అనుకొన్నది రేఖ తండ్రిని చూస్తూ.

శేషయ్యకు దాదాపు మతిపోయినట్టే అయింది.

గోపాలరావు కొడుకు తన కూతుర్ని పెళ్ళిచేసుకుంటానన్నాడా? తను అకౌంటెంటుగా పనిచేసే కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కొడుకు తనకు అల్లుడు అవుతాడా? తను అతడి దగ్గరకెళ్ళి చేతులు కట్టుకొని నిల్చుని–

"అయ్యా! తవరి కొడుకూ, నా కూతురూ ప్రేమించుకుంటున్నారు – త్వరగా ముహూర్తాలు పెట్టించండి" అని చెప్పాలా?

'ఏమిటండీ ఆలోచిస్తున్నారు?'

"మీ అమ్మా కూతుళ్ళకు పిచ్చి పట్టింది."

రేఖ చివ్వున తలెత్తి తండ్రి ముఖంలోకి చూసింది.

'అదేమిటండీ అలా అంటారూ? ఆ అబ్బాయి మన అమ్మాయిని ప్రేమిస్తుంటేనూ? అమ్మాయిని తప్ప మరొకర్ని పెళ్ళి చేసుకోనంటుంటేనూ?'

'ఎవరితో అంటున్నాడట– నీతోనా?'

'నాతో ఎందుకంటాడు? మన అమ్మాయితో అన్నాడట.'

"అమ్మాయితో అంటే ఏం లాభం? ఆ మాట వాళ్ళ అబ్బతోనే అనొచ్చుగా?" విసుగ్గా అన్నాడు శేషయ్య.

"వాళ్ళ నాన్న అంటే రమేష్‌కు భయం. నిన్ను అడగమని చెప్పమన్నాడు." బొటన వేలుతో నేలరాస్తూ అన్నది రేఖ తలవంచుకొని.

తండ్రి ఓ క్షణం కూతుర్ని పరకాయించి చూశాడు.

"మన అంతస్థేమిటి? వాళ్ళ అంతస్థేమిటి?"

"ప్రేమకు అంతస్థులు తెలియవు నాన్నా!"

"మా ఇద్దరి మధ్య ఉన్న అంతస్థు భేదం ఏమిటో నాకు తెలుసు. రోజూ చూస్తున్నదే. ప్రేమకు లేకపోవచ్చు. పెళ్ళికి ఉంటుంది అంతస్థు భేదం!"

"అదేమిటండీ! అలా అంటారు? మీరు అడిగిచూడండి" అన్నది శేషయ్య భార్య భర్తతో.

"రమేష్ అంటే తండ్రికి ప్రాణం. ఒక్కడే కొడుకు. అతడి కోరికను తిరస్కరించలేడు." చిన్నగా అన్నది రేఖ.

తండ్రి కూతురి ముఖంలోకి తీతుగా చూశాడు.

రేఖ గిర్రున తిరిగి లోపలకు వెళ్ళిపోయింది.

శేషయ్య ఆ రాత్రి అంతా ఆలోచించాడు.

శేషయ్య పెద్దకూతురు రేఖ, రెండో కూతురు సునీత. ఆ తర్వాత ఇద్దరూ మగ పిల్లలే.

రేఖను కాలేజీలో చేర్పించాడు శేషయ్య.

మగపిల్లలు కాలేజీ చదువులకు వచ్చేసరికి రేఖ చదువు పూర్తి చేసుకొని ఉద్యోగంలో చేరాలని శేషయ్య కోరిక. చన్నీళ్ళకు వేన్నీళ్ళ సాయంగా రేఖ సంపాదనకూడా ఉంటే మగపిల్లల్ని బాగా చదివించి ప్రయోజకుల్ని చెయ్యవచ్చునని అతడి అభిప్రాయం.

పెద్ద కుర్రాడు చేతికి అందివచ్చాక ఆడపిల్లల పెళ్ళిళ్ళు చెయ్యాలని అతడి ఆలోచన.

శేషయ్యకు రాత్రంతా నిద్రలేదు.

తెల్లవారి ఆఫీసుకు వచ్చాడు. వచ్చీ రాగానే మేనేజింగ్ డైరెక్టర్ గోపాలరావు గదిలోకి వెళ్ళాడు.

శేషయ్యకు ఆఫీసులో మంచిపేరు ఉంది. గౌరవం ఉంది. వళ్ళు వంచి పనిచేస్తాడు. నమ్మకస్తుడు. గోపాలరావుకు అతడంటే గౌరవం ఉంది.

"ఏమిటి శేషయ్యా! పిలవకుండానే పొద్దున్నే వచ్చావ్?" గోపాలరావు నవ్వుతూ అడిగాడు.

శేషయ్య అరచేతులకు చెమట్లు పడుతున్నాయి.

తటపటాయిస్తూ నిల్చున్నాడు. గవదలు బిగిసిపోతున్నట్టుగా ఉంది.

"ఏం కావాలి? చెప్పు! ఏమిటలా చెమట్లు పట్టున్నాయ్? వంట్లో బాగాలేదా? కూర్చో!" అన్నాడు యం.డి.

శేషయ్య కూర్చోలేదు. ఆ మాటకొస్తే శేషయ్య ఎప్పుడూ యం.డి. ముందు కూర్చోలేదు.

"శేషయ్యా! ఏమిటలా ఉన్నావ్? ఫర్వాలేదు కూర్చో!" ఆదరంగా అన్నాడాయన.

శేషయ్య కూర్చోలేదు.

"ఏమిటి శేషయ్యా? ఏదో అడగాలని వచ్చినట్టున్నావ్? సందేహం ఎందుకు? శెలవు కావాలా?"

శేషయ్య నాలుక పిడచకట్టుకుపోతున్నది. శెలవు అక్కర్లేదన్నట్టు తల ఊపాడు.

"మరి?" ఈసారి విసుగ్గా అన్నాడు గోపాలరావు.

"మీ అబ్బాయి, మా అమ్మాయి ఒకే కాలేజీలో చదువుతున్నారు." నాలుకకు అంటుకుపోతున్న మాటల్ని బలవంతంగా బయటికి తోస్తున్నట్టు అన్నాడు శేషయ్య.

శేషయ్య కళ్ళల్లోకి ప్రశ్నార్థకంగా చూశాడు గోపాలరావు.

'వాళ్ళిద్దరూ ప్రేమించుకుంటున్నారట–పెళ్ళి చేసుకోవాలనుకొంటున్నారట' అనేశాడు శేషయ్య.

గోపాలరావు శేషయ్య ముఖంలోకి విస్మయంగా చూశాడు.

శేషయ్యకు భయంగా ఉంది. ముఖంమీద స్వేద బిందువులు–కాళ్ళల్లో వణుకు–"మీ అబ్బాయే ఈ విషయం మీతో చెప్పమని మా అమ్మాయిద్వారా కబురు

పంపించాడు. అందుకే..." వణుకుతున్న గొంతుతో తన తప్పేమీ లేదన్నట్టు సంజాయిషీగా అన్నాడు.

గోపాలరావు ముఖం గంభీరంగా ఉంది.

'తప్పుగా మాట్లాడితే క్షమించండి సార్!'

గోపాలరావు శేషయ్యను పిచ్చివాడిని చూసినట్టు జాలిగా చూశాడు.

"నాకు అభ్యంతరం లేదు" అన్నాడు గోపాలరావు.

శేషయ్య అయోమయంగా చూశాడు. ఇది నిజమా! అతడేమన్నాడు? తనకేం విన్పించింది? తను విన్నది నిజమా? గోపాలరావు ఆ మాట అన్నాడా?

"కాని, ఒక షరతు!"

శేషయ్య తలెత్తి చూశాడు. గోపాలరావు ముఖం ప్రశాంతంగా ఉంది. శేషయ్య గుండెలనిండా గాలి పీల్చుకున్నాడు.

'నువ్వు ఈ ఉద్యోగం మానెయ్యాలి.'

శేషయ్య త్రుళ్ళిపడి గోపాలరావు ముఖంలోకి చూశాడు.

అతడి పెదవులమీద చిరునవ్వు తొణికిసలాడుతోంది.

'ఇష్టమేనా?'

శేషయ్య మాట్లాడేస్థితిలో లేడు.

'నా దగ్గిర గుమాస్తాగా పనిచేసేవాడి కూతుర్ని నా కోడలిగా అంగీకరించలేను. నువ్వు వెంటనే రాజీనామా రాసి ఇవ్వు, యాక్సెప్ట్ చేస్తాను. ఆ తర్వాత ముహూర్తాలు పెట్టుకుందాం.'

శేషయ్య కళ్ళముందు గోపాలరావూ, అతడు కూర్చున్న కుర్చీ, గదిలో ఉన్న ప్రతి వస్తువూ గిర్రున తిరుగుతున్నాయి. కాళ్ళు భూమిమీద ఆనుతున్నట్టుగా లేవు.

'ఏమిటయ్యా! మాట్లాడవేం?' ఈసారి గోపాలరావు కంఠం తీవ్రంగా విన్పించింది.

'క్షమించండి సార్! నేను చాలా తెలివితక్కువగా మాట్లాడాను.'

శేషయ్య గిర్రున తిరిగి బయటకు నడిచాడు.

వెళ్ళిపోతున్న శేషయ్యను జాలిగా చూస్తూ 'పాపం! అమాయకుడు' అనుకొన్నాడు గోపాలరావు.

ఆ దెబ్బతో సరికొత్తగా ప్రారంభం అయిన పాత ప్రేమకథ ముందుకు నడవలేనని మొరాయించి నేలమీద చతికిలబడింది.

✿ ✿ ✿

రమేష్ కాలేజీలో రేఖను తప్పించుకొని తిరుగుతున్నాడు.

రేఖ కాలేజీ మానేసింది.

రేఖకు రమేశ్‌మీద చాలా కోపంగా ఉంది.

దెబ్బతిన్న ప్రేమ ద్వేషంగా మారింది.

రమేష్‌ను తుమ్మచెట్టుకు కట్టేసి, చింతబరికెతో బాదాలనిపిస్తోంది.

కసిదీరా చెంపలు వాయించాలనిపిస్తోంది.

రేఖ ఒక ప్రభుత్వ ఆఫీసులో యల్.డి.సి.గా చేరింది.

రమేష్‌ను మర్చిపోలేకుండా ఉంది. ఆమెను నిరంతరం ఏదో అశాంతి, మృగం

వెంటబడిన వేటగాడిలా తరుముతూనే ఉంది.

రమేష్‌ను ఎలాగయినా కలుసుకోవాలి.

కసితీరా తిట్టాలి.

అప్పుడుగాని తన మనసుకు శాంతి లభించదు.

రేఖ ఊహల్లోనే రమేశ్‌ను ఎన్నోసార్లు చెప్పుతో కొట్టింది. కసితీరా తిట్టింది. ముఖంమీద తుపుక్కున ఊసింది. గోళ్ళతో రక్కింది.

అయినా కసి తీరలేదు.

✿ ✿ ✿

నాలుగేళ్ళు గడిచాయి.

రేఖ జీవితంలో ఎలాంటి మార్పులేదు.

ఆ ఆఫీసులో వాళ్ళకు ఆమె అట్టలు చిరిగిపోయిన వారపత్రికలా కన్పిస్తూంది.

ఆమె నడక, మంచి కథను చెత్తగా కాపీకొట్టిన కథ నడకలా ఉంటున్నది.

ఆమె కళ్ళల్లో ఇప్పుడు కలలు లేవు.

కసి... కసి ఉంది.

ఆమె పెదవులమీద ద్వేషం ఉంది.

ఆమె మనసులోని మధువు ఇంకిపోయింది.

ఆమె లోకంమీదే అలిగిన మనిషిలా కన్పిస్తూంది.

అయినా ఆమె హృదయంలో ఒక కోర్కె వుంది. ఒకే ఒక కోరిక-ఆ కోరిక తీరే రోజుకోసమే ఎదురుచూస్తూ ఉంది.

రమేశ్ ఎప్పటికైనా కన్పించాలి. కసిదీరా ఆ చంపా ఈ చంపా వాయించాలి. ముఖంమీద ఖాండ్రించి ఉయ్యాలి.

అంతే! అదే ఆమె ఏకైక కోరిక.

ఆమె ఎదురుచూసిన రోజు అనుకోకుండా వచ్చింది.

ఆరోజు-ఆ ఆఫీసుకు కొత్త ఆఫీసరు వచ్చాడు.

కొత్త ఆఫీసర్ని చూసి రేఖ దిమ్మెరపోయింది.

రమేష్ రేఖను గుర్తించనట్టే నటించాడు.

రేఖ ఆ రాత్రి నిద్రపోలేదు. రకరకాల ఆలోచనలు.

తెల్లవారి ఆఫీసుకు వెళ్ళగానే తను వాడి గదిలోకి వెళ్తుంది. ఈ చంపా ఆ చంపా వాయించి, ముఖంమీద ఉమ్మేసి బయటికి వచ్చేస్తుంది. అవును! అంతే! అలాగే చేస్తుంది.

రేఖ తెల్లవారి ఆఫీసుకు వచ్చింది.

ఎప్పటిలాగే పనిచేసి ఇంటికి తిరిగి వచ్చింది.

రేఖ రోజూ రాత్రిళ్ళు ఆలోచిస్తూనే ఉంది. 'ఏమైనా సరే రేపు వాడి చంపలు వాయించాలి, భయం ఎందుకు? ఉద్యోగం పోతుంది. అంతేగా? ఎంత తెలియనట్టు నటిస్తున్నాడో-రాస్కెల్!' అనుకుంటూనే ఉంది. రోజులు గడిచిపోతూనే ఉన్నాయి.

రెండేళ్ళ క్రితం రేఖ తండ్రి గుండె ఆగి మరణించాడు. ఇంటిభారం రేఖ మోస్తూ ఉంది.

రేఖ రోజూ ఆఫీసుకు వస్తూనే ఉంది. తన బాధ్యతల్ని గుర్తు చేసుకుంటూ శ్రద్ధగా

పనిచేస్తూనే ఉంది.

రోజూ రేఖకు రమేశ్ కన్పిస్తూనే ఉన్నాడు.

అతడు ఆమెను గుర్తించినట్టు ఒక్కరోజుకూడా కన్పించలేదు.

ఆమె మనసులోని కోర్కె మనసులోనే ఉండిపోయింది.

ఇలా ఆరు నెలలు గడిచాయి.

రమేశ్‌కు ట్రాన్స్‌ఫర్ అయింది. ఆఫీసువాళ్ళు అతను కావాలనే ట్రాన్స్‌ఫర్ చేయించుకొన్నాడని అనడం రేఖ విన్నది.

రమేశ్ వెళ్తూ వెళ్తూ రేఖకు ప్రమోషన్ ఆర్డరు వేసి వెళ్ళాడు.

ఎస్టాబ్లిష్‌మెంటు సూపర్నెంటు ఆర్డరు రేఖకు అందించాడు.

ఆర్డరు చూసి రేఖ కసిగా పెదవి కొరుక్కుంది.

ఆ ఆర్డర్ను ముక్కలు ముక్కలుగా చింపి చెత్త బుట్టలో వెయ్యాలనుకుంది.

ఆ ప్రమోషన్ తనకు అక్కరలేదని రాసి ఇవ్వాలనుకుంది.

చేతిలో ఉన్న ఆర్డరు మడిచి భద్రంగా పర్సులో పెట్టుకుంది.

కొత్త సీట్లోకి వెళ్ళి కూర్చుంది.

ఆఫీసులో అందరికీ కాఫీలు తెప్పించి ఇచ్చింది.

చిరునవ్వుతో అందరి అభినందనల్నీ స్వీకరించింది.

ఇంటికి వచ్చింది.

తల్లి ఏదో అంటోంది. రేఖ తల్లికేసి చూడకుండా గబగబా గదిలోకి వెళ్ళి భళ్ళున తలుపులు మూసింది.

మంచంమీద బోర్లాపడి భోరుమని ఏడ్చింది.

✿ ✿ ✿

ఈ కథ సుఖాంతమో, దుఃఖాంతమో మీరే చెప్పాలి.

అసలు ఇది ప్రేమకథో, కాదో కూడా మీరే చెప్పాలి.

(79 జ్యోతి ప్రత్యేక సంచిక)